# గురువు అంటే ఎవరు?

ఇంతకుముందు భక్తిని గురించి చెప్పుకొనినపుడు మూఢభక్తి ఉండకూడదనుకొన్నాము. అలాగే ఇపుడు భగవద్గీతలోని త్రైతసిద్ధాంతమును తెలియనివాడు ఆధ్యాత్మికము తెలియనివాడన్నాము. ప్రస్తుతము గురువును గురించి చెప్పుకోవలసియున్నది. విద్యను బోధించువాడు గురువని చాలామంది అనుకొంటుంటారు. మనము ఇక్కడ విద్యలను, రెండు రకములుగా విభజించుకొనిన, ఒకటి ప్రపంచవిద్య, రెండవది పరమాత్మ విద్య అని తెలుసుకొన్నాము. ప్రపంచ విద్యలలో గురువు ఉండవచ్చు, ఉండకపోవచ్చు. కానీ పరమాత్మ విద్యలో తప్పనిసరిగ గురువు ఉండి తీరాలి అని కూడ చెప్పుకొన్నాము. దాని ప్రకారము పరమాత్మ విద్యలో గురువు ఎట్లుంటాడో, ఎవరు గురువో తెలుసుకొనే దానికి ప్రయత్నిద్దాము.

బ్రహ్మవిద్య లేక దైవవిద్య అయిన పరమాత్మ జ్ఞానమును బోధించు వారు నేడు భూమిమీద చాలామంది కలరు. అయితే వీరందరు గురువులౌతారా? అని ప్రశ్నించుకొని చూస్తే ఒక్క ప్రాంతములో, ఒక్క కాలములో, ఒక్క వ్యక్తిగానే గురువుంటాడు అను సూత్రము ప్రకారము మేము గురువులమని ఎందరో పేరుగాంచినా, అందరిలో ఒక్కడు మాత్రము గురువుండవచ్చును. పై సూత్రము ప్రకారము ఏక కాలములో ఒకనికంటే మించి గురువులుండుటకు వీలులేదు. ఒక్క ప్రాంతములో అన్నాము కాబట్టి భూమండలములో దేశములన్నిటిని కలిపి చూచిన ఒక దేశములోనే ఒకే గురువుండును. దీని ప్రకారము విశ్వమంతటికి గురువు ఒక్కడేనని తెలియుచున్నది. దైవజ్ఞానమును తెలుపువారు ఎందరుండినా వారిలో ఒకడు గురువు ఉండవచ్చును. దేవుని జ్ఞానము దేవునికి తప్ప ఏ ఇతర మనిషికి తెలియదు. దైవజ్ఞానము మనుషులకు తెలియాలంటే దేవుడే గురువుగా భూమిమీద ఉండి తన జ్ఞానమును తానే చెప్పవలసియుండును. అతనే నిజమైన గురువు. దేవుడు భూమిమీదకు ఎప్పుడు వస్తాడంటే? తన ధర్మములు భూమి మీద తెలియకుండా పోయినపుడు, అధర్మములు ప్రజలలో ప్రాకిపోయినపుడు, అధర్మములను లేకుండ చేయుటకు తన ధర్మములను తెలుపుటకు తనకు తానుగా వచ్చువాడు దేవుడు. ఆ దేవుడే నిజమైన గురువు. ధర్మములకు ముప్పు ఏర్పడి అధర్మములు భూమిమీద చెలరేగుటకు కొన్ని వేలు లేక కొన్ని లక్షల సంవత్సరముల కాలము పట్టును. కావున గురువు భూమిమీదకు లక్షల సంవత్సరములకో, వేల సంవత్సరములకో రాగలడు. భూమిమీద జ్ఞానము చెప్పు ప్రతివాడు గురువగుటకు అవకాశమే లేదు. జ్ఞానము చెప్పు ప్రతివాడు బోధకుడు కావచ్చును, కానీ గురువు ఎప్పటికీ కాలేడు. దేవుడు మనిషిగా వస్తే గురువు అవుతాడు, కానీ మనిషి ఎప్పటికీ గురువు కాలేడు. ఇక్కడ కొందరికి లేక కొన్ని మతముల వారికి ఒక ప్రశ్న రావచ్చును. దేవుడు దేవునిగానే ఉంటాడు, మనిషిగా ఎప్పుడు రాడు, ఒకవేళ భూమిమీద జ్ఞానము అవసరమైతే తన దూతలను పంపి వారి ద్వారా జ్ఞానమును చెప్పించును. ఆ విధముగా దేవునిచేత పంపబడిన దూతను ప్రవక్త అంటున్నాము. అటువంటి ప్రవక్తను గురువన వచ్చును. కానీ దేవుడు భూమిమీదకు వస్తాడని మీరెలా చెప్పుచున్నారని ప్రశ్నించ వచ్చును. దానికి మా జవాబు ఏమనగా! పరమ పవిత్ర పరిశుద్ధగ్రంథమైన భగవద్గీతలో శ్రీకృష్ణుడు జ్ఞానమును బోధిస్తూ ***"పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతామ్, ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే"*** అని అన్నాడు. దీని అర్థము చెడు చేయువారిని లేకుండ చేయుటకు, మంచివారిని అభివృద్ధి చేయుటకు ధర్మసంస్థాపన నిమిత్తము నేను సంభవిస్తాను అన్నాడు. దీనినిబట్టి దేవుడు భూమిమీదకు ధర్మమును స్థాపించుట కొరకు వస్తానని చెప్పినట్లే కదా! అని మేమంటే దానికి కొందరు కృష్ణుడు దేవుడని నిరూపణ ఏమిటని అంటున్నారు. ఇటువంటి ప్రశ్న భవిష్యత్తులో వస్తుందని తెలిసిన దేవుడు, తాను దేవుడననే

విషయము ఇతరులు తెలియునట్లు అర్జునునకు విశ్వరూపమును చూపాడు. అంతేకాక కృష్ణునిగా వచ్చినవాడు దేవుడని తెలిసిన భీష్ముడు కృష్ణున్ని జగద్గురువు అన్నాడు.

ఇతర మతముల సోదరులు,పెద్దలు ముఖ్యముగా గమనించవలసిన దేమనగా! దేవుడు విశ్వమంతా అణువణువున వ్యాపించియున్నాడు. అట్లు విశ్వవ్యాపి, సర్వధారి అయిన దేవుడు, అంతట లేకుండపోయి ఒక మనిషిగా వస్తాడని మేము కూడ చెప్పలేదు. విశాలమైన దేవుని నుండి ఒక్క అణువంత అంశ (భాగము) లేక విశాలమైన దేవుని శక్తి నుండి ఒక అణువంత శక్తి ఒక కనిపించెడి మనిషిగా పుట్టడమును దేవుని అవతారము అంటున్నాము. అటువంటి వానినే భగవంతుడు లేక గురువు అంటున్నాము. దేవునికి గల అనేక కోటానుకోట్ల అంశలలో ఒక్క అంశ పుట్టితే అదే గురువు. దీనిని బట్టి దేవుడు మనిషిగా రావచ్చును అన్నాము. దేవుడు మనిషిగా అనగా గురువుగా భూమి మీద కనిపిస్తే, ఆ సమయములోనే అసలైన ధర్మములతో కూడుకొన్న జ్ఞానము మానవులకు ఆయన ద్వారా తెలియును. కానీ ఆయన గురువుగా ఏమాత్రము తెలియబడడు. ఆయన మనుషులకు తెలిసినా, తెలియకుండినా ఆ సమయములో విశ్వమునకంతటికి ఆయనొక్కడే గురువు. ఈ విధముగా దేవుడే గురువు లేక గురువే దేవుడని చెప్పవచ్చును. అందువలన ఏ మనిషి గురువుగా మారలేడు అని చెప్పాము. భూమిమీద కనిపించని దేవుడు కనిపించే గురువుగా రావచ్చును. కానీ కనిపించే మనిషి గురువుగా మారలేడు. గురువు దేవుడే అగును, ఆయన దైవత్వమును గురించి పూర్వపు పెద్దలు ఒక శ్లోకములో ఈ విధముగా అన్నారు.

*"దుర్లభం త్రిషులోకేషు, తచ్ఛృణుష్వ వదామ్యహమ్,*
*గురుబ్రహ్మ వినా నాన్యః సత్యం సత్యం."*

**భావము :-** ముల్లోకములందు వ్యాపించి తెలియుటకు దుర్లభమైన దేవున్ని గురించి చెప్పుచున్నాను వినుము. కనిపించు గురువే కనిపించని దేవుడు. విశ్వమంతటిని లెక్కించి చూచితే గురువును వదలి అన్యమైనదేదియు లేదు. ఈ మాట ముమ్మాటికి సత్యము! సత్యము!!

**వివరము :-** దుర్లభమైన వాడు దేవుడు ఒక్కడే. ఎందుకనగా ఆయనకు ఆకారములేదు, పేరూ లేదు. రూపనామములులేని వానిని కనుగొనుట దుస్సాధ్యమే కదా! ఒకవేళ రూపము, పేరూ లేకున్ననూ ఆయనకు ఏదైనా ఒక అడ్రస్ (చిరునామ) ఉన్నదా అని యోచిస్తే ఇక్కడ ఉన్నాడు అక్కడ లేడనుటకు ఏమాత్రము వీలులేని విధముగ అంతట వ్యాపించియున్నాడు. నామముగానీ, చిరునామముగానీ లేకుండ, ఆకారముగానీ, అందముగానీ లేకుండ, కనిపించక అంతట అందరిలో ఉన్న దేవుడు ఒకప్పుడు తనకవసరమైనప్పుడు కనిపించు మానవాకారముతో వస్తే, ఆ ఆకారమునే **గురువు** అంటున్నాము. దేవుడే గురువైనపుడు గురువును మించినదేదియు ప్రపంచములో లేదు. ఈ మాట పూర్తి సత్యమైనది అని శ్లోకములో పెద్దలు చెప్పియున్నారు. ఆనాటి పెద్దలు చెప్పిన విషయమునే మేము కూడ బలపరుస్తూ దేవుడే గురువుగా వస్తాడు తప్ప, ఏ మనిషికి గురువుగా ఉండుటకు ఏమాత్రము అవకాశములేదు. **దేవుడు గురువూ, గురువు దేవుడూ కావచ్చును కానీ మనిషిని గురువనుకోవడము పూర్తి అజ్ఞానమగును. ఒకవేళ ఏ మనిషైనా తాను గురువువని ప్రకటించుకొంటే అతను ఎంతటి వాడైనా అతనిని గురువుయొక్క వివరము తెలియని అజ్ఞానియేనని చెప్పవచ్చును.**

ఇంతవరకు గురువును గురించి వ్రాసినవారు ఇప్పుడు మేము చెప్పిన విధముగ గురువు మనిషిగా రావచ్చుననకుండ, మనిషి గురువుగా మారునని చెప్పియున్నారు. పుట్టిన మనిషి ఎవరు గురువుగ మారదని వారికి తెలియక అలా వ్రాసియుండవచ్చును. పుట్టిన మనిషి గురువుగా మారుట దుర్లభము. ఎప్పుడైనా సంభవిస్తే దేవుడు గురు రూపముగా అనగా మనిషిగా రావచ్చును. ఆ విధముగనైన గురువు ఎల్లప్పుడు భూమిమీద ఉండడు. ఆయనకు అవసరమైనపుడు, ధర్మములను తెలియజేయునిమిత్తము మాత్రమే వచ్చి, సందర్భము చూచి ధర్మములను తెలియజేసి పోవును. అటువంటి గురువు తాను గురువునను గుర్తింపు ఏమాత్రము తెలియకుండ ప్రజల మధ్యలో ఉండును. ఆయన చెప్పిన బోధను చూచి ఇది సాధారణ మనిషి చెప్పు జ్ఞానముకాదనీ, దీనిని ఒక గురువు తప్ప ఎవరు చెప్పలేరని, ఎవడైన తెలివైనవాడు మనిషిగాయున్న గురువును గ్రహించగలిగితే నిజమైన గురువు వానిని ఆ భావమునుండి తప్పిపోవునట్లు చేయగలడు. గురువు కృష్ణుడను మనిషిగా వచ్చినపుడు, కృష్ణుని బోధను చూచి ఈయన నిజమైన దేవుడని కొందరు గ్రహించినప్పటికీ, ఆయన ప్రవర్తనను చూచి కృష్ణున్ని సాధారణ మనిషియేనని కొందరూ, మోసగాడని కొందరూ, జారుడని కొందరూ, చోరుడని కొందరూ అనుకొన్నారు. కొందరు తెలివైనవానిగ లెక్కించుకోగా, కొందరు గొప్పజ్ఞానిగ లెక్కించుకొన్నారు. కానీ దైవాంశనిండిన గురువనీ, దేవుడనీ అనుకోలేదు. ఆ కాలములో భగవద్గీతను వినీ, విశ్వరూపమును చూచిన అర్జునునికి కూడ కృష్ణుడు దేవుడు కాదని అనుమానమురాగా కృష్ణున్ని మేథావిగా మాత్రము అర్జునుడు అనుకొన్నాడు తప్ప గురువుగా గానీ, దేవునిగా గానీ గుర్తించలేదు. కానీ అనాటి భీష్ముడు కృష్ణుని గీతను వినకుండినా, ఆయన విశ్వరూపమును చూడకుండినా కృష్ణున్ని నిజమైన దేవునిగా, సృష్టికర్తగా, జగద్భర్తగ, జగద్గురువుగా లెక్కించాడు. చాలా సందర్భములలో కృష్ణుడు సాధారణ మనిషికాదని ఇతరులకు కూడ చెప్పాడు. భీష్ముని విశ్వాసము ముందర ఏ మాయ పని చేయలేదు. దీనినిబట్టి విశ్వాస లోపముంటే గురువును ఎవరూ గుర్తించనట్లు తన మాయ చేత అనుమానమును రేకెత్తించును. సంపూర్ణ విశ్వాసిని మాత్రము తననుండి దూరము చేయదని తెలియుచున్నది. గురువును భూమిమీద ఎవరూ గుర్తించరు అనుటకు వీలులేకుండ దేవుని మీద శ్రద్ధ విశ్వాసము ఉన్నవారు గుర్తించగలరని చెప్పుటకు భీష్ముడు తార్కాణముగా నిలిచాడు.